తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



## చిరుత దాడిలో నాలుగు మేకలు మృతి



ఐరాల, జనవరి 18 ప్రబాతవార్త: చిరుతపులి దాడిలో నాలుగు మేకలు మృతిచెందిన ఘటన మండలంలోని చెంగనపల్లె గ్రామ సమీపంలోని దుర్గంకొండలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కతనం మేరకువివరాలిలావున్నాయి. చెంగనపల్లె గ్రామ సమీపంలోని దుర్గంకొండ దిగువన దామోదర్‌గౌడ్ అనే వ్యక్తి కాపురముంటున్నారు. ఇతను తన మేకలను దుర్గంకొండపై మంద ఏర్పాటు చేసి మేపుకొంటున్నాడు. ఈనేపథ్యంలో కొండపై వున్న మేకల మందపై బుధవారం రాత్రి చిరుతపులి దాడిచేసింది. దీనితో మందలోని నాలుగు మేకలు మృతి చెందాయి. ఈవిషయాన్ని రైతు దామోదర్‌గౌడ్ గురువారం ఉదయం కనుగొని స్థానిక అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

## రామభక్తులకు వెంకన్న లడ్డూప్రసాదం

### -అయోధ్యకు లక్షలడ్డూలు తరలింపు

తిరుమల,జనవరి 18ప్రభాతవార్తప్రతినిధి:



అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహప్రతిష్టాపన మహోత్సవాన భక్తులకు లడ్డూప్రసాదాలు అందించేందుకు టిటిడి లక్ష లడ్డూలు తయారు చేసింది. 25గ్రాముల బరువున్న ఈ లడ్డూలను గురువారం 350 బాక్సుల్లో డిప్యూటీ ఈఓ (జనరల్)శివప్రసాద్, పోటో ఏఈఓ శ్రీనివాసులు, శ్రీవారి సేవకులు అయోధ్యకు పంపే ఏర్పాట్లు చేశారు.

### దేశ అభివృద్ధి

## ప్రధాని మోడీతోనే సాధ్యం

### - కేంద్రమంత్రి దేవ్‌సింగ్ చౌహాన్ స్పష్టం

ఓజిలి, జనవరి 18 ప్రభాతవార్త



మాట్లాడుతున్న కేంద్రమంత్రి దేవసింగ్ చౌహాన్

దేశం అభివృద్ధి, పేదల సంక్షేమం, భారత ప్రధాని నరేంద్రమోడీతోనే సాధ్యమని కేంద్రమంత్రి దేవ్‌సింగ్ చౌహాన్ అన్నారు. గురువారం ఓజిలి మండలంలోని తిరుమలపూడి గ్రామ పంచాయతీలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.దయాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపిడిఓ రజనీకాంత్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. బహిరంగ సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ పరిపాలనలో దేశం సుభిక్షంగా ఉందన్నారు. కేంద్రప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం 17 రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. నాయకులు, అధికారులు సంక్షేమ పథకాలైనా ఉజ్వల దీపం పథకం, మహిళా ఉపాధికి సమృ ద్ధి యోజన, జలజీవన్ మిషన్, సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలు ప్రజలకు చేరువ చేయాల న్నారు. జనవరి 22వ తేదీన దేశంలోనే గర్వించదగ్గ శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ ముహూర్తం నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలందరూ వారి ఇళ్లలో ఐదు రకాల దీపాలు వెలిగించి పూజ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఆర్డీఓ చంద్రముని, సర్పంచ్ గోపాలయ్య, ఏపీవో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకరి పాపం.. మరొకరికి శాపం

### తిరుపతి ఉప ఎన్నికల్లో బోగస్ ఓట్లు నమోదు సంచలనం

### తిరుపతి డిప్యూటీ కమిషనర్, ఆర్‌డిఓ సస్పెండ్ -మరికొందరు తాశీల్దార్లుపై వేటుకు సిద్దం!



తిరుపతి,జనవరి 18ప్రభాతవార్త న్యూస్‌నెట్‌వర్క్: తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో బోగస్ ఓట్ల నమోదు ప్రక్రియలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులపై సస్పెండ్ వేటు వేసింది. బోగస్ ఓట్ల నమోదులో అప్పటి కమిషనర్ లాగిన్ ఐడిద్వారా దాదాపు 30వేలకుపైగా ఎపిక్ కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేయించడం, వాటిపై ఫోటోలు మార్ఫింగ్‌చేసి, దొంగ ఓట్లు వేయించుకునేలా అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు దగ్గరుండి సహకరించారనే ఆరోపణలపై అన్నమయ్యజిల్లా కలెక్టర్ పిఎస్ గిరీషాపై తొలి సస్పెండ్ వేటు వేసింది. అలాగే ఇంకా పలు రకాలుగా అక్రమాలకు వంత పాడారనే ఆరోపణలపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, తిరుపతి ఆర్‌డిఓ కనకనరసారెడ్డిని ఇప్పటికే ఈసి సస్పెండ్ చేయడంతో రెవెన్యూ అధికారుల్లో భయం పుట్టుకొచ్చింది.ఎన్నికల సమయంలో పారదర్శకంగా, నిజాయితీతో విధులు నిర్వర్తించాల్సి న కొందరు రెవెన్యూ,ఐఎఎస్ అధికారులు అధికారపార్టీ నేతలకు సలామ్ అంటూ బోగస్ ఓట్లను నమోదు చేయించడం, ఆ ఓట్లపై ప్రతిపక్షాల ఫిర్యాదులతో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తాజాగా స్పందించడంతో తిరుపతిలో సంచలనం రేకెత్తిస్తోంది. తిరుపతి పార్లమెంట్‌కు 2021 ఏప్రిల్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో అప్పటి తిరుపతి కమిషనర్ ,ఈఆర్‌ఓగా వ్యవహరించిన పిఎస్ గిరీష ప్రస్తుతం అన్నమయ్యజిల్లాకలెక్టర్‌గా పనిచేస్తున్నా ఈసి సస్పెండ్ చేసింది. 2021 ఎంపి ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించుకునేలా అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు దగ్గరుండి సహకరించారనేది టిడిపి,బిజెపి నేతల ఫిర్యాదులు.దీనిపై ఇటీవల ఎన్నికల కమిషన్ అధికారులు చేపట్టిన విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో ముగ్గురు బాధ్యతాయుత అధికారులపై ఈసి సస్పెండ్ చేయడం సంచలనంగా మారింది. ఇంకా దొంగ ఓట్లు వేయించడంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు, నేతలకు సహకరించిన తాశీల్దార్లు, పోలీసుశాఖలో కొందరు ఎస్ఐలు, కొందరు సిబ్బంది హస్తం ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అయితే అసలు అప్పటి కమిషనర్ గిరీషా లాగిన్ ఐడి ఎవరు హ్యాక్ చేశారు. ఏ ప్రజాప్రతినిధి దాన్ని తమకు అనుకూలంగా మలచుకున్నారనే విషయం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2021లో జరిగిన తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల బోగస్ ఓట్లు పుణ్యమాని అదికారుల్లో భయం పట్టుకుంది. అంతేగాక అప్పటి కమిషనర్ మెయిల్ ఐడి పాస్‌వర్డ్ కీ ఎవరు హ్యాక్ చేశారు. ఎలా బోగస్ ఓట్లు నమోదు చేయించారు. ఎఫిక్ కార్డులు తయారుచేశారనే అభియోగాలు సంచలనం కలిగిస్తున్నాయి. మొత్తంమీద తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల పాపం కొంతమంది అధికార పార్టీ రాజకీయనాయకుల రెవెన్యూ, పోలీసుశాఖల్లోని అధికారులు బలి పశువులు కానున్నారు.

## వైకాపా చిత్తూరు ఎంపీ అభ్యర్ధిగా డిప్యుటీ సిఎం నారాయణస్వామి

చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త:



చిత్తూరు పార్లమెంటు అభ్యర్థిగా వైకాపా అధిష్టానం డిప్యుటీ సిఎం నారాయణస్వామిని ఖరారు చేసింది. ప్రస్తుతం జిడినెల్లూరు అసెంబ్లీ స్థానం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యుటీ సిఎం నారాయణస్వామికి అక్కడి నుండి మరోసారి పోటీ చేయడానికి అవకాశం కల్పించకుండా చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసింది. జిడినెల్లూరు నుండి ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నారాయణస్వామి మళ్లీ 2024 ఎన్నికల్లో మూడవ సారి పోటీ చేయడానికి సిద్ధం అయ్యారు. పార్టీ అధిష్టానం సైతం ఇక్కడి నుండి డిప్యుటీ సిఎం నారాయణస్వామి పోటీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు డిప్యుటీ సిఎం నారాయణస్వామిపై ఒక్కసారిగా తిరుగుబాటు చేశారు. దీంతో పార్టీ అధిష్టానం పునరాలోచనలో పడి డిప్యుటీ సిఎం నారాయణస్వామికి చిత్తూరు ఎంపీ అభ్యర్థిత్వం కేటాయించింది.

### జిడినెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్ధిగా ఎంపీ రెడ్డప్ప



జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా అభ్యర్థిగా చిత్తూరు సిట్టింగ్ ఎంపీ రెడ్డప్ప పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుతం ఎంపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న రెడ్డప్ప జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. జిడినెల్లూరు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యుటీ సిఎం నారాయణస్వామిపై నియోజకవర్గ వైకాపా నాయకులు, కార్యకర్తలు తిరుగుబాటు చేయడంతో పార్టీ అధిష్టానం ఆలోచించి చిత్తూరు ఎంపీగా విధులు నిర్వహిస్తున్న రెడ్డప్పకు జిడినెల్లూరు అభ్యర్థిత్వం కేటాయించి, జిడినెల్లూరు ఎమ్మెల్యేగా వున్న డిప్యుటీ సిఎం నారాయణస్వామిని చిత్తూరు ఎంపీ అభ్యర్థిత్వం కేటాయిస్తూ నిర్ణయం తీసుకొంది.

### మహిళా సంఘాల సభ్యుల

## రుణ వడ్డీ బ్యాంకు ఖాతాలకు జమ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, జడ్పీ ఛైర్మన్, ఎంపీలు.

చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త: మహిళా సంఘాల సభ్యులకు రుణ వడ్డీ మొత్తంను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం సిఎం క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుండి కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులులు మాట్లాడుతూ జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో లబ్ధిదారులకు వడ్డీ రీఎంబర్స్‌మెంట్ ద్వారా 25,736 మంది లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు 339 కోట్ల నగదు జమ అయ్యిందన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు మెగా చెక్కును అందజేశారు. మేయర్ అముద, హౌసింగ్ పిడి పద్మనాభం, స్త్రీ,శిశుసంక్షేమశాఖ జడ్పీ స్టాండింగ్ కమిటీఛైర్మన్ భారతిలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

### కలసికట్టుగా అభ్యర్థిత్వం ఆశిస్తున్న ఆశావాహులు



చిత్తూరు, జనవరి 18 ప్రభాతవర్త: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిత్వం ఆశిస్తున్న అభ్యర్థులందరు గురువారం జరిగిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ సిఎం ఎన్టీఆర్ 28వ వర్ధంతికి కలసికట్టుగా హాజరయ్యారు. చిత్తూరు అసెంబ్లీ స్థానం నుండి 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణీ భర్త చంద్రప్రకాష్, తెలుగుదేశం సీనియర్ నాయకులు గురజాల జగన్మోహన్ నాయుడు, యువనేత వసంత్‌కుమార్, తెలుగు దేశం బీసీ నాయకులు సిఆర్ రాజన్‌లు ఆశిస్తున్నారు. వీరందరు జిల్లా కేంద్రం చిత్తూరులో గురువారం వివిధ ప్రాంతాల్లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి కలసికట్టుగా హాజరై ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు ఆధ్వర్యంలో వీరందరు కలిసి జిల్లా తెలు గుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి, ఆపై జడ్పీ కార్యాలయ ఆవరణలో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి, అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పిసిఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వీరు పాల్గొని నిరుపేదలు, విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు మోహన్‌రాజ్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగిసిన కొండచుట్టు

### కన్నుల పండువగా తోటోత్సవం



చంద్రగిరి, జనవరి 18 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి కొండచుట్టు మహోత్సవం అంగరంగ వైభవంగాముగిసింది. భీమసేనుడు, అర్జునుడు, ద్రౌపదిఅమ్మవారు వెంటరాగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారు కొండచుట్టు ముగించుకుని గురువారం ఆలయానికి చేరుకున్నారు. సంక్రాంతి మహోత్సవాలలో భాగంగా అమ్మవారు వసంతాలాడుతూ కొత్తపేటలోని శ్రీ వీరబ్రహ్మంగారి ఆలయానికి చేరుకున్నారు. రాత్రి అమ్మవారి తోటోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అన ంతరం అమ్మవారు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, సి.ఆర్.తిమ్మారెడ్డి, టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఏజి పల్లి బాల, పులికంటి మోహన్ రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, కన్నయ్య నాయుడు, రమేష్ రెడ్డి, రాజులగారి వినోద్ కుమార్ రెడ్డి, దొమ్మలపాటి సతీష్, అనార్కలి, శానంబట్ల తులసి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు చంద్రబాబు వెంకటగిరి రాక



వెంకటగిరి, జనవరి 18, ప్రభాతవార్త టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ మంత్రి నారాచంద్రబాబు నాయుడు రా కదలిరా బహిరంగ సభ నిర్వహించేందుకు శుక్రవారం వెంకటరెడ్డి వస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బోలిగల మస్తాన్ యాదవ్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో హెలికాప్టర్‌లో దిగుతారని తెలిపారు. అక్కడి నుండి హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణానికి అశేష జనవాహిని కరతాల ధ్వనుల నడుమ చేరుకుంటారని చెప్పారు. పార్టీ శ్రేణులు అభిమానులు భారీగా తరలి వస్తారని చెప్పారు.

## తాడేపల్లిలో మంత్రి పూజలకు శివయ్య ప్రసాదాలు



శ్రీకాళహస్తి,జనవరి 18 ప్రభాతవార్త రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి తన సొంత నియోజకవర్గంలో ధర్మప్రచారంలో భాగంగా కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరుని శివయ్య ప్రసాదాలతో పాటు అక్కడే శివపార్వతుల కళ్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సకల సదుపాయాలతో ఓ వాహనం బయలుదేరింది.అక్కడ ప్రసాదాల తయారికి ఇద్దరు వంట మనుషులతో పాటు వంట పాత్రలు గెంటిలు కూడా తీసు కెళ్ళారు.అక్కడ పవిత్రతకు భంగం కల్గకుండా హంగామా సృష్టించారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలో ఇది చర్చనీయాంశంగా ఉంది.వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిలో దేవాదాయశాఖ మంత్రి 'శివపార్వతుల కళ్యాణం, రాహుకేతుదోష నివారణ పూజలు' నిర్వహణకు నిర్ణయించారు.ఈ మేరకు శివయ్య సన్నిధి నుంచి అధికారికంగా చెబుతున్న సమాచారం మేరకు 1500 స్పెషల్ లడ్డులు,ప్రత్యేకంగా తయారు చేసిన 1500 వడలను తయారు చేసి పంపారు. శివపార్వతుల కళ్యాణం నిర్వహణకు అర్చకులు కూడా ఇక్కడి నుంచే పంపారు. అయితే'రాహుకేతుదోష నివారణ' పూజలకు ఏర్పాట్లు చేయాలని మంత్రి కోరారు.కానీ అలా చేస్తే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని దేవస్థానం తిరస్కరించినట్లు సమాచారం.అయితే ఓ బస్సులో లడ్డులు,వడలు, వంట మాస్టర్లు, ప్రసాదాల తయారికి ముడిసరకులను కూడా ఆలయం నుంచే తీసుకెళ్ళినట్లు చర్చించుకుంటున్నారు.కొందరు సమర్ధిస్తుంటే మరికొందరు విమర్శిస్తున్నారు.మంత్రి ఇలాకాలో కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలంటే దగ్గరలో సింహాచలం, అన్నవరం,విజయవాడలున్నాయి.కానీ 400కిలో మీటర్ల దూరంలోని శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి తరలించటంలో ఆంతర్యమేమిటో అని చర్చించుకుంటున్నారు.

### వర్చువల్ విధానంలో

## పలు అంశాలపై సమీక్ష

### రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి డా.కెఎస్ జవహర్ రెడ్డి

తిరుపతి కార్పొరేషన్, జనవరి 18, ప్రభాతవార్త విజయవాడ ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్ విధానంలో ఫేజ్ - 3 రీ సర్వే, ఇనామ్, అసైన్డ్ భూములు, పిఎంజి ప్రాజెక్ట్, ఆరోగ్య, వైద్యం, కుటుంబం సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ, మహిళా శిశు సంక్షేమశాఖ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్ రెడ్డి సమీక్షించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, డిఆర్‌ఓ పెంచల్ కిశోర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవానీ శంకర్, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి శ్రీహరి, ఎడి సర్వేర్ జయరాజ్, పిడిఐసిడిఎస్ జయలక్ష్మి, జిల్లా సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ శివకుమార్, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్ తేజస్విని, కలెక్టరేట్ సూపర్డెంట్ భారతి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుండి కుల గణన

### - కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త: జిల్లాలో శుక్రవారం నుండి ఈ నెల 28వ తేదీ వరకు కుల గణణ సర్వే జరుగుతుందని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లా నుండి గురువారం కలెక్టర్ సగిలి షన్మోమన్ కుల గణన నిర్వహణ ఏర్పాట్లపై తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఇఓపిఆర్డీలు, మున్సిపల్ కమీషనర్లు, సచివాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కుల గణన సర్వే 10 రోజుల పాటు మొబైల్ యాప్ ద్వారా డోర్ టూ డోర్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి మండలంను నాలుగు విభాగాలుగా విభజించుకొని, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఇఓపిఆర్డీలు, మున్సిపల్ కమీషనర్లు కుల గణన సర్వేను పరిశీలించాలన్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకల్లా కుల గణన సర్వే ప్రారంభించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు 200 కుటుంబాలను సర్వే చేయాలని, ఏ రోజుకు చేయాల్సి న కుటుంబాల సర్వేను ఆ రోజే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలను మాత్రమే నమోదు చేయాలన్నారు. ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టం లేకుంటే వారిని ఎట్టి పరిస్థితుల్లోను చెప్పాలని బలవంతం పెట్టకూడదన్నారు. అలాగే సచివాలయ పరిధిలోని వాలంటీర్లు ఏ ఏ కుటుంబాలకు వెళ్ళాలనే విషయంపై ప్రొసిడింగ్స్ ఇవ్వాలని పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. వాలంటీర్లకు సచివాలయ సిబ్బందికి మ్యాపింగ్ చేయాలని ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి వాలంటరీ సర్వే చేసిన అనంతరం వెరిఫికేషన్ చేయాలన్నారు. కుల గణనకు సంబంధించి ఎద్దైనా సమస్యలు ఉత్పన్నం అయితే వాటిని శుక్రవారం ఉదయం 10 గంటలకల్లా తన దృష్టికి తీసుకురావాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, సాంఘీక సంక్షేమ, సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి, బిసీ సంక్షేమశాఖ డిడి రబ్బానీ భాషా, బిసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి, డిఎల్‌డిఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గురువుకు విశేషాభిషేకాలు: పరవశించిన భక్త జనం

### దక్షిణామూర్తి దర్శనంతో పునీతం



శ్రీకాళహస్తి,జనవరి 18 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు,హోమాలు, అభిషేకాలు ఆలయ ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ సేవల్లో పాల్గొన్న భక్తులు భక్తి పారవశ్యంతో పునీతులయ్యామని భావించారు. గురువారం దక్షిణామూర్తి అభిషేకానికి ఆదరణ పెరుగుతుంది. స్థానిక భక్తులే కాకుండా తమిళనాడు నుంచి వచ్చే భక్తులు కూడా విశేషంగా వస్తున్నారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో కాలుమోపిన వారికి తెలియని అనుభూతి కల్గిస్తుంది. ఆలయంలో ప్రవేశించిన వెంటనే బాహ్య ప్రపంచాన్ని మరచి పోతారు. శివయ్య సేవలో తరిస్తారు. అంతటి మహిమాన్విత దివ్యక్షేత్రంలో వెలసిన గురువు దక్షిణామూర్తికి గురువారం పండగలా పూజలు నిర్వహించటం ఈ దివ్యక్షేత్రంలో ఆచారంగా వస్తుంది.

#### గురుదక్షిణామూర్తికి విశేష పూజలు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచుగడప నుంచి ప్రవేశిస్తూనే మొట్టమొదట దర్శనమిచ్చేది. గురుదక్షిణామూర్తి. ఇక్కడ దక్షిణామూర్తి క్షేత్రపాలకుడుగా విరాలజిల్లుతున్నారు.ఈ ఆలయం వద్ద ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడి ఆలయాన్ని భక్తుల భాగస్వామ్యంతో బంగారుతాపటం జరిపించారు.అంతేకాక గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు.ఉదయం ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. తరువాత స్వామికి హోమాలు నిర్వహించారు. అనంతరం పాలు,పెరుగు, పంచామృతం,చందనం, పసుపు,తేనె, నారికేళ్ళ జలంతో అభిషేకాలు జరిపారు. తరువాత సుగంధ పరిమళ పుష్పాలతో,స్వర్ణాభారణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి,కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్,సుదర్శనం నాయుడు, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, భక్తులు విశేష సంఖ్య హాజరైనారు.పూజలు,అభిషేకాలను ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

## కుప్పంలో మినీ రైల్వేఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు వినతి

కుప్పం, జనవరి 18 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలో ప్రజల సౌకర్యార్థం కొత్తగా మినీ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని దక్షిణపశ్చిమ రైల్వే డివిజనల్ మేనేజర్ యోగేష్ మోహన్‌కు సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు వినతిపత్రం అందించారు. కుప్పంలోని కొత్తపేట, ఆర్.పేట ప్రాంతాల ప్రజలకు అనువుగా 101 గేటు మీదుగా వంతెన నిర్మించాలని ఆయన కోరారు. అలాగే కుప్పంకు అదనంగా రెండు పుష్‌పుల్ రైళ్లు నడపాలని, పలు రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ కేటాయించాలని కోరారు. కుప్పం నుంచి రోజూ వేలాది మంది ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్తుంటారని ప్రజల సౌకర్యార్థం ఉదయం 8.30, సాయంత్రం 5గంటలకు పుష్పుల్ రైళ్లు నడపాలని కోరారు. బెంగళూరు - హటియా, వేళాంగణి, గోవా, దాదర్, చెన్నై మెయిల్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వాలని, కాచిగూడ-యలహంక రైలునుకుప్పం వరకు పొడిగించాలని కోరారు. కార్యక్ర మంలో బాలసుబ్రమణ్యం, చంద్రశేఖర్ గౌడు, వెంకటేష్, పద్మజ, అరుణ, సుగుణ పాల్గొన్నారు.

## పిఇఎస్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం

కుప్పం, జనవరి 18 ప్రభాతవార్త

కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ప్రజల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య తెలిపారు. బిపి, షుగర్, మూత్రకోశ, కిడ్నీసంబంధిత వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు సమస్యలు, చిన్నపిల్లలు, చర్మసంబంధిత వ్యాధులు, గర్భసంచి, మానసిక, కంటి సమస్యలపై అడ్మిట్ అయిన వారికి ఆపరేషన్లు పూర్తి ఉచితంగా నిర్వహిసు_్తన్నట్లు తెలిపారు. అలాగే మందులపై పదిశాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు.

## కర్ణాటకమద్యం సీజ్

రామకుప్పం, జనవరి 18 ప్రభాతవార్త

మండలంలోని కెంచనబళ్ల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు యాభైవేల విలువ చేసే కర్ణాటక మద్యంను ఎస్సై శివకుమార్ సీజ్ చేశారు. అందిన సమాచారం మేరకు సురేష్‌బాబు అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేయగా కర్ణాటక మద్యం పట్టుబడిందని ఎస్సై తెలిపారు. సురేష్‌బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వినోద్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సేవలు మరువలేనివి - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, జనవరి 18 ప్రభాతవార్త



ఎన్టీఆర్ సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఎనీఆర్ వర్ధంతి సందర్భం గా శాంతిపురంలో ఎన్టీఆర్ విగ్రహంకు పూజలు చేసి ఘన నివా ళులు అర్పించారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథ నాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, మణి, నాగరా జు, రమేష్, ఉయ్యాల జయరాంరెడ్డి, మునేగౌడు, శివ, శేఖర్, దాబు, గోపాల్, బాబు నాయుడు, నారా యణరెడ్డి, సింగిరిశ్రీనివాసులు, కేశవులు, చంద్ర కళ, అనసూయ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు. అన్ని పంచాయతీ కేంద్రాల్లో దేశం నేతలు ఎన్టీఆర్ వర్ధంతిని జరిపారు.

## గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలు

శాంతిపురం, జనవరి 18 ప్రభాతవార్త

మండలంలోనినడింపల్లి, రేగడదిన్నేపల్లిగ్రామాల్లోవికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభలను గురువారం అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి తులసినాథ్, మండల అధ్యక్షుడు కాశీనాథ్, గజేంద్ర, ఆంజనేయులు, కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి.



-రాష్ట్ర విశ్వబ్రాహ్మణుల కార్పొరేషన్ ఛైర్మన్ పవిత్రమురళికృష్ణ.

పెద్దపంజాణి, జనవరి18, ప్రభాతవార్త :

రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ పవిత్రమురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం పలమనేరు మార్కెట్ కమిటీ సభ్యులు శివాడి సురేష్ ఆధ్వర్యంలో ఛైర్మన్ పవిత్రమురళికృష్ణను విశ్వబ్రాహ్మణ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఏఎంసి డైరక్టర్ సురేష్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్‌చైర్మన్ పదవి పవిత్రమురళి కృష్ణకు అప్పగించడంపట్ల సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికికృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి కులగణన

పాలసముద్రం, జనవరి 18 ప్రభాతవార్త:

మండలంలో శుక్రవారం నుండి కుల గణనను సచివాలయ సిబ్బంది వాలంటీర్లతో కలసి ఇంటింటికి వెళ్లి కుల గణన సర్వేలో భాగంగా ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తారని ఎంపిడిఓ రామనాథరెడ్డి తెలిపారు. ఎంపిడిఓ రామనాథరెడ్డి గురువారంఎంపిడిఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అలాగే రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల రూపాయల వరకు ఆరోగ్యశ్రీ కార్డుకు వైద్యం ఉచితం చేయడంతో ఆరోగ్యశ్రీ కార్డుకు ఈకెవైసి చేసుకోవడానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి

బంగారుపాళ్యం, జనవరి 18 ప్రభాతవార్త:

ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం బంగారుపాళ్యంలో తెలుగుదేశం నాయకులు నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం శేషాపురం వద్ద వున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పి జయప్రకాష్, జనార్ధన్‌గౌడ్, మండల తెలుగుయువత అధ్యక్షుడు రమేష్, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, టిడిపి ఉపాధ్యక్షుడు కమలనాధరెడ్డి, చిత్తూరు పార్లమెంటు బీసీ కార్యదర్శి హరిప్రసాద్, క్లస్టర్ కో-ఆర్డినేటర్ ధరణినాయుడు, మాజీ సింగిల్‌విండోఅధ్యక్షుడు వాసు దేవనాయుడు, రైతు నాయకులు రాజేంద్ర నాయుడు, సర్పంచ్ కుప్పాల మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా ముగింపు సమావేశం



బంగారుపాళ్యం, జనవరి 18 ప్రభాతవార్త:

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై గురువారం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపిపి అమరావతమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్రా చేపట్టిందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా కింద పలు పోటీలను నిర్వహించామన్నారు. ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటిసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఎఎంసి ఛైర్మన్ నారె సోమశేఖర్ పాల్గొన్నారు.

## తెలుగుజాతి కీర్తిపతాక ఎన్టీఆర్

- తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పం, జనవరి 18 ప్రభాతవార్త

తెలుగుజాతి కీర్తిపతాక దివంగత ఎన్టీఆర్అని టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ ముని రత్నం పేర్కొన్నారు. గురువారం దివంగత ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా కుప్పంలో ఎన్టీఆర్ విగ్రహానికి దేశం నేతలు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం, కుప్పం ఏరియా ఆస్పత్రిలో రోగులకుపాలు, పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షుడుప్రేమ్‌కుమార్, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, కన్నన్, జాకీర్, ప్రతాప్, అనసూయ, డా॥ నరేష్, సతీష్ పాల్గొన్నారు.

**కుప్పం రూరల్ :** మండలంలోని మిట్టపల్లిలో దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని ఘన ంగా నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షుడుప్రేమ్‌కుమార్, నేతలు ఎవి రవి, లీలావెంకటేష్, చలపతి, హరోగరన్, మంజు, బగ్గిడి వెంకటేష్, దండపాణి, గోవిందరాజు, రఘుపతి, కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**గుడుపల్లె :** గుడుపల్లెలోఎన్టీఆర్‌వర్ధంతిని దేశం నేతలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమాల్లో పార్టీ కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, నేతలుబాబునాయుడు, బేటప్ప నాయుడు, హేమాంబరగౌడు, సుబ్బు తదితరులు పాల్గొన్నారు. కంచిబందార్లపల్లిలో తెదేపా, జనసేన నేతలు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా సుమారు ఐదువందల మందికి అన్నదానం జరిపారు.

**రామకుప్పం :** ఎన్టీఆర్‌వర్ధంతిని రామకుప్పంలో తెదేపా నేతలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు నిర్వహించి ఆయన సేవలను దేశం నేతలు కొనియాడారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, సీతాపతి, చలపతి, చిన్నికృష్ణ, గంట్లగౌడు, నందారెడ్డి, సలాంసాబ్, టివి రవి, రామకృష్ణప్ప, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నేత త్రిలోక్ ఆరోగ్య స్థితిపై చంద్రబాబు ఆరా

కుప్పం, జనవరి 18 ప్రభాతవార్త

కుప్పం తెలుగుదేశం యువనాయకుడు డిఎస్ త్రిలోక్ ఆరోగ్య పరిస్థితిపై తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు ఫోన్‌లోఆరా తీశారు. గతేడాది సెప్టెంబ ర్‌లో త్రిలోక్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని పలు ఆస్పత్రుల్లోచికిత్స పొందారు. ఇటీవలే బెంగళూరులో త్రిలోక్‌ను చంద్రబాబు నాయుడు పరామర్శించారు. అయితే మరలా త్రిలోక్‌కు అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో త్రిలోక్ ఆరోగ్య పరిస్థితిపై బెంగళూరులోని వైద్యులతో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతానికి త్రిలోక్ పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలపడంతో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను చంద్రబాబునాయుడు కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వాల్మీకులు ఫోన్‌చేస్తేచాలు అందుబాటులో ఉంటా..

-విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు

పుంగనూరు, జనవరి 18, ప్రభాతవార్త:

తనకు ఫోన్‌చేస్తేచాలు వాల్మీకులకు సాయంచేసేందుకు అందుబాటులో ఉంటా నని విశ్రాంత డిఎస్పీసు కుమార్‌బాబు వాఖ్యానించారు. గురువారం ఆయన మండలంలోని నేతిగుట్లపల్లిలో పర్యటించి, వాల్మీకి సంఘ నూతన కాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన ఎర్రగుంట్లపల్లి, కురవూరు, ఆరంట్లపల్లి, ఆవులవారిపల్లి, కమ్మవారిపల్లిలలోసంక్రాంతి ఉత్స వాలలో భాగస్వామ్యమయ్యారు. ఆయన వెంటవాల్మీకి సంఘ నాయకుడు అద్దాల నాగరాజ, స్టోర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిన జనం

చౌడేపల్లి, జనవరి 18 ప్రభాతవార్త

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు మండలం నుంచి 50మంది సభ్యులతో కూడిన బృందం స్థానిక మండల పరిపాలన భవనం నుంచి బస్సులో విజయవాడకు తరలి వెళ్ళారు. ఎంపిపి గాజుల రామ్మూర్తి, సింగిల్ విండో ఛేర్మన్ రవిచంద్రా రెడ్డి, వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరదన గోవిందయ్య యాత్రను ప్రారంభించగా తహశీల్దార్ మాధవరాజు, ఎంపిడిఓ సుధాకర్, ఉపాధ్యాయుడు హరినాథ్, డిష్‌సూరి పాల్గొన్నారు.

## క్రీడలకు వయస్సు అడ్డుకారాదు : జడ్పీటీసీ

చౌడేపల్లి, జనవరి 18 ప్రభాతవార్త



క్రీడలకు వయస్సుతో నిమిత్తం లేదని జడ్పీటీసీ నడింపల్లి దామోదర్‌రాజు అన్నారు. ఎ.కొత్తకోట క్రాస్‌వద్ద ఆడుదాం ఆంధ్ర క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఎంఇఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, ఉపాధ్యాయుడు హరినాథ్, పిడి రామచంద్రయ్య, క్రికెట్‌క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

గుడిపాల, జనవరి 18 ప్రభాతవార్త:

ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో తెల ఎగుదేశం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడుసుబ్రమణ్యంనాయుడు, టిడిపి సీనియర్ నాయకులు గురజాల చెన్నకేశవులు, పార్టీ ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సుమతి మురళి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి, నాయకులు చంద్రమోహన్, రాజా, రవినాయుడు, శంకరచౌదరి, జయదేవనాయుడు, బాల, కిట్టు, ఇతర టిడిపి నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## 22న విద్యా సంస్థలకు సెలవు

- జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు అభ్యర్థన

చిత్తూరురూరల్, జనవరి 18 ప్రభాతవార్త:

ఆయోధ్య శ్రీరామ మందిరంలో ఈ నెల 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ట జరుగుతుండటంతో ఈ కార్యక్రమంను దేశ పౌరులైన విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి టివిల్లో వీక్షించడానికి విద్యా సంస్థలకుసెలవుప్రకటించాలనిజిల్లాబిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు ఓ ప్రకటనలో అభ్యర్థించారు. ఈ నెల 22న శ్రీరామ తీర్థ ట్రస్ట్ ప్రజా భాగస్వామ్యంతో ఆయన ప్రారంభోత్సవంను నిర్వహిస్తోందన్నారు.

## తెలుగుదేశంతోనే తెలుగువారి ఆత్మగౌరవంకు రక్షణ



- మండల 'దేశం' ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు

పాలసముద్రం, జనవరి 18 ప్రభాతవార్త:

తెలుగుదేశంతోనే దేశంలోని తెలుగువారి ఆత్మగౌరవం రక్షణ వుంటుందని మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మండల దేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, ఇతర దేశం నాయకులు, కార్యకర్తలతో కలిసి బలిజకండ్రిగ ఎన్టీఆర్ సర్కిల్‌లోనిఎన్టీఆర్‌విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మండల దేశం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆరుళ్‌నాధన్, మాజీ అధ్యక్షుడు శ్రీనురాజు, నాయకులు వాసునాయుడు, వాటర్ రవి, ఎలుమలై, ఉమాపతి, వెంకటేశులునాయుడు, చిన్నతంబి, ఎల్లప్పన్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సంక్షేమ పథకాల ప్రదాత నరేంద్రమోడీ

- చిట్టమూరు బిజెపి అధ్యక్షుడు దువ్వూరు శరత్‌చంద్రారెడ్డి

చిట్టమూరు, జనవరి 18 ప్రభాతవార్త



భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్న అభివృద్ధి ప్రదాత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అని చిట్టమూరు మండల బిజెపి అధ్యక్షుడు దువ్వూరు శరత్‌చంద్రారెడ్డి అన్నారు. గురువారం చిట్టమూరు మండలం అరవపాలెం సచివాలయ పరిధిలో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆయన అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అరవపాలెం సచివాలయ కార్యదర్శి సురేష్ అధ్యక్షతన జరిగిన మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ రైతుల కోసం కేంద్రప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం డ్రోన్ కెమెరాను పంట పొలాల్లో ఎలా పిచికారి చేయాలో పైలెట్ వెంకటకృష్ణయ్య అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిట్టమూరు సొసైటీ ఛైర్మన్, భారత్ గ్యాస్ నిర్వాహకులు మేరిగల మధు, స్థానిక బిజెపి నాయకులు సుంకరరమణయ్య, వెంకటసుబ్బారెడ్డి, యుగంధర్‌రెడ్డి, వేణురెడ్డి, రాజారెడ్డి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వాన్ని నాశనం చేస్తున్నది కిలివేటి

- సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ శ్రీమంత్‌రెడ్డి

దొరవారిసత్రం, జనవరి 18 ప్రభాతవార్త



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని, వైసీపీ కార్యకర్తలు, అభిమానులను నాశనం చేస్తున్నది సూళ్లూ రుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అని సూళ్లూ రుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అన్నారు. గురువారం దొరవారిసత్రం మండలం వె దురుపట్టు గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు గెస్ట్ హౌస్‌లో వైసీపీ నియోజకవర్గ నాయకులు, కార్యక ర్తలతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి నాయకులు తమ బాధలను, ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. జగన్‌మోహన్‌రెడ్డి ముద్దు.. కిలివేటి సంజీవయ్య వద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పార్టీ కార్యకర్తలను, నాయకులను అణచివేస్తూ ఎమ్మెల్యే సంజీవయ్య గ్రూపు రాజకీయాలు చేస్తూ తనకంటూ సొంత భజన బ్యాచ్‌లతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. గత ఐదేళ్లలో వైసీపీ కార్యకర్తలు, నాయకులపై కక్షసాధింపు చర్యలు చేపట్టారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కట్టా సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కళత్తూరు శేఖర్‌రెడ్డి, 786 రఫీ, నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

గూడూరు, జనవరి 18 ప్రభాతవార్త

గూడూరు మండలం పాలిచర్ల గ్రామంలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం టీడీపీ నాయకులు, న్యాయవాదులు సన్నిబోయిన శ్రీనివాసులు, వనం ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవమే నినాదంగా తెలుగుదేశం పార్టీని స్థాపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసిన యుగ పురుషుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాటంరెడ్డి సురేష్‌రెడ్డి, కంటేపల్లి రామయ్య, చిల్లకూరు శ్రీనివాసులు జడ శ్యాంప్రసాద్, వనం సూర్యచంద్రయ్య, బిట్రగుంట రమణయ్య, జడ పెంచలయ్య, గోవిందు వేమయ్య, ఓజిలి మునికృష్ణ, జడ రమేష్, మంగలపురి మస్తానయ్య, మొర్ర శ్రీహరి, కరిముల్లా, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల్లో తడ ప్రతిభ



తడ, జనవరి 18 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని జరిపిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో తడకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపించారు. ముఖ్యంగా క్రికెట్ పోటీలలో తడ పంచాయతీ పరిధిలోని క్రీడాకారులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. సుమారు 40 టీములు పాల్గొన్న ఈ పోటీల్లో ఎస్‌పిసిసి తడ టీమ్ గెలిచి మొదటి స్థానంలో నిలవడంతో వారిని పలువురు అభినందించారు.

## సంక్షేమ పథకాలే వైసీపీ శ్రీరామరక్ష



- వైసీపీ నేత కె.ధనంజయరెడ్డి

కోట, జనవరి 18 ప్రభాతవార్త

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే వైసీపీ ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అని, రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డి అన్నారు. గురువారం కోట మండలం ఊనుగుంటపాలెం, మద్దాలికండ్రిగ గ్రామాల్లో గొబ్బెమ్మ నిమజ్జనోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని రతనాల రాష్ట్రంగా అభివృద్ధి చేసేందుకు రాజన్న బిడ్డ జగనన్న పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజారంజక పథకాలు అమలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చేవూరు నాగేశ్వరరావు, ఎంపిపి దాసరి అంజమ్మ, జడ్పిటిసి దాసరి కోటయ్య, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ పుట్టా నారాయణ, కోటారెడ్డి, నాగూర్ యాదవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయకర్తను కలిసిన వైసీపీ నేత చెంచురాఘవరెడ్డి

కోట, జనవరి 18 ప్రభాతవార్త



శాసనమండలి విప్, గూడూరు వైసీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్‌ను కోట మండలం సిద్దవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి గురువారం కలిశారు. మురళీధర్‌కు బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చెంచురాఘవరెడ్డి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో మేరిగ మురళిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలుపరిచిన సంక్షేమ పథకాలే ఎమ్మెల్యేల గెలుపు శ్రీరామరక్ష అన్నారు.

## కోట తూర్పుపల్లెల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కోట, జనవరి 18 ప్రభాతవార్త

కోట మండలంలోని కొక్కుపాడు, ఉత్తమనెల్లూరు, అల్లంపాడు, పుచ్చలపల్లి గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రత్యేక వాహనంలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పవర్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ భవాని, మండల యువమోర్చా అధ్యక్షుడు పరశురామ్ సాయి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్

టిడిపి సీనియర్ నేత రామ్మోహన్‌నాయుడు

ఓజిలి, జనవరి 18 ప్రభాతవార్త



పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన మహనీయుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని టిడిపి సీనియర్ నేత కంకణాల రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఓజిలిలోని బస్టాండ్ సెంటర్లో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి సీనియర్ నేత కంకణాల రామ్మోహన్‌నాయుడు, సతీష్‌చంద్ర పాల్గొన్నారు. ముందుగా వారు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు విజయ్‌కుమార్‌నాయుడు, ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, టిడిపి నాయకురాలు సరోజనమ్మ, సీనియర్‌నాయకులుపాడివెంకటసుబ్బయ్య, కంకణాలసత్యవరప్రసాద్‌నాయుడు, సుబ్రహ్మణ్యం రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాసులు, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖలీల్, ఓజిలి వెంకటయ్య, నాగయ్య, పి.సురేంద్రబాబు, పురుషోత్తం రాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సినీ, రాజకీయాలకు వన్నె తెచ్చిన మహనీయులు ఎన్టీఆర్

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జనవరి 18, ప్రభాతవార్త

ఎన్టీ రామారావు సినీ, రాజకీయ రంగానికి వన్నె తెచ్చారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ వద్ద ఉన్న ఎన్టీ రామారావు విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జి. నాగేశ్వర రావు, డాక్టర్ మస్తాన్ యాదవ్, రమణయ్య, మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, నాయకులు విశ్వనాథం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేట బస్సుయాత్రను విజయవంతం చేయండి

తడ, జనవరి 18 ప్రభాతవార్త



ఈ నెల 21న వైసీపీ నిర్వహిస్తున్న బస్సుయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన తడలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంలో బస్సుయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయుడుపేటలో ఈ కార్యక్రమం రాష్ట్ర పార్టీ నాయకుల సారథ్యంలో జరుగుతుందని వివరించారు. కలిసికట్టుగా మండలంలోని నాయకులు ఈ కార్యక్రమాలకు జనసమీకరణ చేపట్టాలని చెప్పారు. పలువురు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## ఎన్టీ రామారావు చిరస్మరణీయులు

మండల పార్టీ మాజీ అధ్యక్షులు మస్తాన్ నాయుడు

బాలాయపల్లి, జనవరి 18, ప్రభాతవార్త



దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ చిరంజీవిగా ఉంటారని మాజీ మండల పార్టీ అధ్యక్షులు మస్తాన్ నాయుడు తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ సిఎం తారక రామారావు వర్ధంతి సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, టిడిపి నేతలు కోటేశ్వర గౌడ్, వెంకటాద్రి, రావి సత్యంనాయుడు, మండల పరిశీలకులు చంద్రగిరి గుర్రప్ప నాయుడులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించి, కొద్దిసేపు మౌనం పాటించారు.

## మద్దాలిలో ధనంజేయ రెడ్డికి ఘనస్వాగతం

కోట, జనవరి 18, ప్రభాతవార్త



కోట మండలం మద్దాలికండ్రిగ ఉనుగుంటపాలెం గ్రామంలో గొబ్బెమ్మ నిమజ్జనోత్సవ కార్యక్రమంలో గురువారం వైకాపా సీనియర్ నాయకుడు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొడవలూరు ధనంజేయ రెడ్డికి ఈ రెండు గ్రామాల ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రతిఒక్కరిని ఆయన ఆప్యాయంగా పేరుపేరున పలకరించారు. గొబ్బెమ్మ ఉత్సవాలకు ఆయన భారీ స్థాయిలో నగదును భక్తులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంజిమ్మ, జడ్పిటిసి సభ్యుడు కోటయ్య, చేవూరు నాగేశ్వర రావు, కోటారెడ్డి, సుబ్రమణ్యం, పుట్టా నారాయణ, హనుమంత్ రెడ్డి, శివరామనాయుడు, మహిళా నాయకురాలు శేషమ్మ, నాగూర్ యాదవ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు

చిల్లకూరు, జనవరి 18, ప్రభాతవార్త



నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గూడూరు నియోజకవర్గ ఇంచార్జ్ పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ పెంచలకోన దేవాలయ ట్రస్ట్ ఛైర్మన్ తానంకి నానాజీ ఆదేశాలు మేరకు గురువారం చిల్లకూరు దర్గా దగ్గర నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాలర్పించారు. అ ఈ కార్యక్రమంలో నాయకులు చిల్లకూరు పట్టాభిరెడ్డి, ధనంజయ కట్ట రామచంద్రరెడ్డి, బెల్లంకొండ రాజేంద్ర, మిక్సిడ్ కాలనీ యూత్ శంకర కాలనీ యూత్ హరిజనవాడ యూత్ అరుంధతివాడ యూత్ గొల్లపాలెం యూత్ వడ్డిపాలెం యూత్ గ్రామ ప్రజలు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

చిత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త:

చిత్తూరు ఓవర్ బ్రిడ్జిపై గురువారం రాత్రి 7 గంటలకు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడటంతో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు అతనిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు అతని వద్ద సమాచారం ఎదైనా లభిస్తుందని వెతికితే అతని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డుతో పాటు ఇతర వివరాలు ఏవి ట్రాఫిక్ పోలీసులకు లభించలేదు. ఈ మేరకు అతని గురించి తెలిసిన వ్యక్తులు 94910 74515 నెంబర్‌ను సంప్రదించాలని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

## తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం

**విజయపురం, జనవరి 18 ప్రభాతవార్త :**
వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చి పూర్వ వైభవం సాధిస్తుందని ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఇన్ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని కొత్త ఇల్లత్తూరులో ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం దిశగా ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.
వైసిపి నుంచి టిడిపిలో చేరికఇల్లత్తూరు పంచాయతీలో వైసిపి, కాంగ్రెస్ నుంచి పలువురు కార్యకర్తలు గాలి భానుప్రకాశ్ సమక్షంలో టిడిపిలో చేరారు. వినోద్, బాలకృష్ణ, సురేష్, గిరి, మునిచంద్ర, వెంకటస్వామిరాజు, రమేష్, ప్రకాశ్, సతీశ్, రాఘవ, శేఖర్, హరికృష్ణ, మురుగ, శీను తదితరులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఇంటింటి కులగణన పక్కాగా చేపట్టండి

**కమిషనర్ హరిత**
**తిరుపతి కార్పొరేషన్, జనవరి 18, ప్రభాతవార్త**



తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటింటికి వెళ్లి కులగణన పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. కులగణనపై నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి పది రోజులు పాటు ఇంటి ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బందిచే కులగణన సర్వే చేయించాలని అన్నారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. కులాల వారి జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక, పురోగతి నమోదు చేయాలని అన్నారు. మహిళా విశ్వవిద్యాలయ నందు ప్రాంతీయ స్థాయి సదస్సును నిర్వహించామన్నారు. ఈ సదస్సులో వివిధ వర్గాలకు సంబంధించిన మేధావులు పాల్గొని వారి అభిప్రాయాలను తెలిపారని అన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయ పరుచుకుని కులగణనను విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటి కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అఫీసర్లు కెఎల్ వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, ఏసిపి బాల సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయుడు ఎన్టి రామారావు

**తిరుపతిరూరల్, జనవరి 18 ప్రభాతవార్త:**



దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆదర్శప్రాయుడని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి అన్నారు. రామారావు జీవితం ఆదర్శప్రాయమని, తెలుగు ప్రజల కీర్తిని దేశానికి చాటిచెప్పిన ఏకైక తెలుగు వ్యక్తి ఎన్టిఆర్ అని తెలిపారు. గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని చెర్లోపల్లి గ్రామపంచాయతీలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. టిడిపి యువ నాయకులు విప్పర్ల లోకేష్ నాయుడు మాట్లాడుతూ తెలుగు జాతీ ఖ్యాతిని దేశం నలుమూలలకే కాకుండా ప్రపంచ వ్యాప్తం చేసిన ఘనత ఎన్టీఆర్కే దక్కుతుందన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తల ధర్నాకు సంఘీభావం

**తొట్టంబేడు, జనవరి 18 ప్రభాతవార్త**



అంగన్వాడీ చిరుద్యోగులపై ఎస్మా ప్రయోగించడం హేయమైన చర్య అని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ తెలిపారు. అంగన్వాడీల కార్యకర్తల ధర్నాకు గురువారం సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయపరమైన డిమాండ్ల సాధనకోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటిపురందేశ్వరి సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గత 38రోజులుగా నిరవధికంగా అంగన్వాడీ ఉద్యోగస్తులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ధర్నాలో భాగంగా పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమానికి తమ సంఘీభావం తెలుపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా సభ్యులు ఎస్వీరమణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటిగోపాల్, నేతలు పగడాల ప్రతాప్, ప్రధాన కార్యదర్శిలు కోనేటిఅయ్యప్ప, కందాటి మునిరాజ, పుచ్చకాయల రమేష్యాదవ్, మార్జాల రమేష్, కటికం చంద్రశేఖర్, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్ళు పాల్గొన్నారు.

## అభివృద్ధి కొరవడిన శ్రీకాళహస్తి నియోజకవర్గం..రిషితారెడ్డి

**శ్రీకాళహస్తి, జనవరి 18 ప్రభాతవార్త**



అన్నపూర్ణగా ఖ్యాతిగడించిన రాష్ట్ర కీర్తికి మాయని మచ్చగా తయారైన వైసిపి మూకల ఆరాచక చర్యలతో రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా జగన్రెడ్డి పాలనకు సమాధికట్టడానికి రాష్ట్రంలోని మహిళలు కంకరణబద్ధులు కావాలని , నియోజకవర్గంలో అభివృద్ధి కొరవడిందని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి బొజ్జలసుధీర్రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి, బొజ్జలబృందమ్మలు పిలుపునిచ్చారు. గురువారం ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 29,30 వార్డుల్లో పట్టణ అధ్యక్షులు విజయకుమార్, క్లస్టర్ ఇన్ఛార్జి కంటా రమేష్, యూనిట్ ఇన్ఛార్జిలు ప్రకాష్నాయుడు, పోలూరుశ్రీనివాసులురెడ్డి, సత్రవాడ ప్రవీణ్, గోపియాదవ్, మోహన్గౌడ్, మునిశేఖర్గౌడ్, లీలా మోహన్, మారిముత్తు, లోకనాదం, వెంకటరమణ, గణేష్, మునస్వామి, మణికంఠల ఆధ్వర్యంలో ఇంటింటా మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. తెదేపా పార్టీ రాబోవు ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టిన తర్వాత అర్హులైన వారికి అందించబోయే విశిష్ట పథకాలను వివరించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జి.దశరధాచారి, వన్నెకులక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రేణుకాదేవి, తెలుగు మహిళా తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు చక్రాల.ఉష, జిలానీబాష, పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, డా.ఉమేష్రావు, ఎంఎస్.రెడ్డి, సరోజమ్మ, పార్వతీ, దుర్గ, మల్లిక, కనకాంబరం, సిద్దయ్య, రవి, శివయ్య, గణేష్, చిన్నా, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ ఎన్టీఆర్కు నివాళులు

**శ్రీకాళహస్తి, జనవరి 18 ప్రభాతవార్త**



తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరితారక రామారావు 28వ వర్ధంతి సందర్బంగా టౌన్బ్యాంకు ఛైర్మన్ డివి.నారాయణ నందమూరితారకరామారావు స్వగ్రామమైన నిమ్మకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయన నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయతో పాటు పలువురు తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## వెంకటగిరిలో జరిగే బహిరంగసభను జయప్రదం చేయండి

**శ్రీకాళహస్తి, జనవరి 18 ప్రభాతవార్త**



జాతీయతెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు వెంకటగిరిలో జరిగే రా..కదలిరా..బహిరంగ సభ విజయంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతి నాయుడు, రెడ్డివారిగురవారెడ్డి, దశరధాచారిలు సంయుక్తంగా పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలోఏర్పాటు చేసినసమావేశంలో వీరు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న జగన్మోహన్రెడ్డి అరాచక ఆటవిక పాలనకు సంబందించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి దుర్మార్గపుపాలన రాష్ట్రంలో సాగుతోందని త్వరలోనే వైకాపా పాలనకు చరమగీతం పాడనున్నారన్నారు. నేడు సామాన్యమానవుడు జీవనం సాగించలేని పరిస్థితుల్లో జీవనం చేయలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెదేపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని అందుకే నేడు వెంకటగిరిలో జరిగే బహిరంగసభకు ప్రజలందరు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



**పెద్దపంజాణి,జనవరి18, ప్రభాతవార్త :**
ఎన్టీఆర్ వర్ధంతిని తెలుగుదేశంనేతలు ఘనంగా నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలుచేసి ఆయన ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవలను వివరించారు కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఆనంద్, తెదేపాకార్యదర్శిచలపతినేతలు మురహరిరెడ్డి, శ్రీరాములురెడ్డి, రోజారెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకం రెడ్డి,చెంగారెడ్డి,డి.వెంకటరమణ,శంకరప్ప,ఐటీడీపీ శ్రీని వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ఆదర్శపురుషుడు

**రామచంద్రాపురం, జనవరి 18 ప్రభాతవార్త:**



నందమూరి తారకరామారావు ఆదర్శ పురుషుడని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు.గురువారం రామచంద్రాపురం కూడలిలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన్చౌదరి, చినబాబు, కోరా హరిప్రసాద్, కొట్టె నరశింహారెడ్డి, గంటాల జీవరత్నం, రవి, ధనంజయ రెడ్డి, గిరిధర్ రెడ్డి, రావిళ్ళ గిరి, సురేంద్ర నాయుడు,పాల్గొన్నారు.

## రేపు సదాశివకోనలో తలనీలాల వేలం

**వడమాలపేట, జనవరి 18 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని సదాశివకోనలో మహా శివరాత్రి సందర్భంగా తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం ఈ నెల 20న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ జయచంద్రన్ తెలిపారు. స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ఈ నెల 20వ తేదీ శనివారం ఉదయం తలనీలాల బహిరంగ వేలంనిర్వహిస్తున్నట్లుతెలిపారు వేలంలో పాల్గొనేవారు 15 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని

## రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

**రేణిగుంట, జనవరి 18 ప్రభాతవార్త:**



రేణిగుంట జీఆర్పీ పోలీస్స్టేషన్ పరిధిలోని రేణిగుంట ఏర్పేడు మధ్య రైల్వే ట్రాక్పై సుమారు 25 సంవత్సరాల యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్కానిస్టేబుల్ గౌరిశంకర్ కథనం మేరకు..రేణిగుంట ఏర్పేడు రైల్వే మార్గంలో ఓ యువకుడు మృతి చెంది ఉండడాన్ని గుర్తించిన కొందరు రైల్వేపోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అనిల్ ఆదేశాలతో హెడ్కానిస్టేబుల్ గౌరిశంకర్ ఘటన స్థలం చేరుకున్నారు. రైల్వే ట్రాక్పై ఓ యువకుడు కదులుతున్న రైలు కింద మెడ పెట్టి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. తల శరీరం వేరుగా తెగిపడి గుర్తించాడు. అతని వద్ద లభించిన లేఖ ద్వారా పేరు రాజుగా నిర్ధారించారు. రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్సీ మహిళకు ఉద్యోగవకాశం

**రేణిగుంట, జనవరి 18 ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో గణితం బోధించడానికి ఎస్సీ మహిళలకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పీజీటీ పోస్టుకు దరఖాస్తు చేసుకో వాల్సిందిగా నెల్లూరు ఐ టీడీఏ ప్రాజెక్టు అధికారి మందారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు సెకండ్ క్లాస్ పోస్టు గ్రాడ్యుయేషన్తో పాటు బీఎడ్ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు ఏపీ టెట్ పాసై, రెండు లెవెల్స్ తప్పని సరిగా ఇంగ్లీష్ మీడియం చదివి ఉండాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు చెందిన ఎస్సీ మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.పూర్తి చేసిన దరఖాస్తుఫారాలను రేణిగుంట విమానాశ్రయంకి వెళ్లే మార్గంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో జనవరి 23వ తేదీ లోపు సమర్పించాలన్నారు.

## తెలుగువారి ఆరాధ్య దైవం ఎన్టీఆర్

**రేణిగుంట, జనవరి 18 ప్రభాతవార్త:**



తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్టీఆర్ని ఎన్నటికీ మర్చి పోలేరని రేణిగుంట మండల,పట్టణ టీడీపీశ్రేణులుముక్తకంఠంతో అన్నారు. రేణిగుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చంద్రా రెడ్డి, జిల్లా టీడీపీనేతచెర్లోపల్లిసుబ్రహ్మణ్యంరెడ్డి,రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా,టీడీపీ సీనియర్నేతలు డి.పుష్పనాథం, చిన్నారెడ్డి, మునస్వామి నాయుడు, బుజ్జినాయుడు, మురళి, నగరి మునయ్య, భాస్కర్రెడ్డి, కన్నన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికా బద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యం

**వరదయ్యపాలెం, జనవరి 18, ప్రభాతవార్త**



గ్రామ పంచాయితీ ప్రణాళికబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమ వుతుందని ఎంపిడిఓ సుబ్రమణ్యం రాజు పేర్కొన్నారు. వరదయ్యపాలెం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలు 2024-25 సంబం ధించిన శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. అందులో భాగంగా ఎంపిడిఓ సుబ్రమణ్యం రాజు మాట్లాడుతూ గ్రామ పంచాయితీలో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమ వుతుందని సూచించారు. ఈవోపిఆర్డి చిరంజీవి, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జిపిడిపి పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయితీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

**వరదయ్యపాలెం, జనవరి 18, ప్రభాతవార్త**



నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ అధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం బస్టాండ్ ఆవరణలో తెలుగుదేశం జెండా వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి టిడిపి మండల అధ్యక్షుడుయుగంధర్రెడ్డిఅన్నదానకార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జిలు నిర్మల్, కుమార్,దశర్ధన్,నవాబ్, జై చంద్ర నాయుడు, శ్రీనివాసన్ నాయుడు, కన్నయ్య, నాగభూషణ్ నాయుడు,సుదర్శన్రెడ్డి,సుధాకర్,నాగరాజు యాదవ్, నరసింహారాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## చలో కడప బిసి గర్జన గోడ పత్రిక ఆవిష్కరించిన బిసి సంఘం నాయకులు

**తిరుపతి మహిళావర్సిటీ, జనవరి 18, ప్రభాతవార్త**



బీసీ జనాభా దామాషాగా రాజ్యాధికారం దక్కాలి అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం హాల్లో బిసి చలో కడప అంటూ బిసి గర్జన గోడ పత్రికను ఆంధ్రప్రదేశ్ బిసి ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు టి. గోపాల్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. గురువారం తిరుపతిలోని బాలాజీ కాలనీలో గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి ఈ నెల 21వ తేది రాయలసీమ కేంద్రమైన కడప నగరంలో కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ బిసి గర్జన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచిన రాజ్యాంగం ఏర్పడి 73 సంవత్సరాలు గడిచిన ఆంధ్రప్రదేశ్లో బిసిలు ఇంకా రాజకీయ పదవుల కోసం కొన్ని వర్గాల దయ దక్షిణ్యాలపై ఆధారపడి ఉన్నందున రాజ్యాధికారం దక్కకుండా పోతున్నదని రాజ్యాధికారం కొన్ని వర్గాల చేతుల్లోనే పరిమితం అయిపోయిందని వాపోయారు. బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్ట భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ బిసి ఉద్యోగులందరూ ఐక్యతతో మెలిగి బిసిల రాజ్యాధికారం కోసం సహాయ సహకారాలు అందించాలని మేమెంతో మాకంత అనే నినాదం ఆంధ్రప్రదేశ్ బిసి ఉద్యోగుల సంఘం ఆవిష్కరణ తర్వాతే ఉద్యోగుల సంఘం ద్వారానే ఈ నినాదం వెలుగులోకి వచ్చిందని ఆ రకంగా బిసి జనాభా అనుగుణంగా బిసిలకు రాజ్యాంగ రిజర్వేషన్ కల్పించి రాజ్యాధికారం పొందడానికి బీసీలే పోరాడాలని ఉద్ఘాటించారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా బిసిల ఐక్యత కోసం పోరాడుతున్న బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడుం రెడ్డి బాబుని బిసి సంఘం నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిసి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వర రావు, బిసి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ విజయ ఉత్తరాది, బిసి సంఘం నాయకులు దేవరాజులు సుబ్రమణ్యం, బాబురావు, మునికృష్ణ, మల్లికార్జున పిసి మహిళా విభాగం నాయకురాలు నెల్లూరు మునిలక్ష్మి, బిసి ఉద్యోగ సంఘం నాయకులు సుదర్శనం, యుగంధర్, విజయభాస్కర్, సురేష్, భాను, వాసు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ విజేతకు రూ. 10,000 నగదు బహుమతి

**పుత్తూరు, జనవరి 18 ప్రభాతవార్త**



సంక్రాంతి సందర్భంగా ఈ నెల 13వ తేదీన గేట్పుత్తూరులోనిచర్చ్కాంపౌం డ్లో తెలుగు యువత ఆధ్వర్యంలో ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. విజేతలకు రాష్ట్ర తెలుగు యువత మీడియా సమన్వయకర్త, పదో వార్డు టిడిపి ఇన్ఛార్జ్ డి.జి. ధనపాల్ నగదు బహుమతి అందిం చారు. విన్నర్స్గా నిలిచిన గోవింద మ్మ జట్టుకు రూ. 10,000 వేలు, రన్నర్స్ ఫ్రెండ్స్ 11 జట్టుకు రూ. 8,000 వేలు, మూడో స్థానం దక్కించు కున్న టీమ్ ఎవెంజర్స్ జట్టుకు రూ. 2,000 వేలు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, స్థానిక యువత పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎన్టీఆర్ సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం

**నారాయణవనం, జనవరి 18 ప్రభాతవార్త :**



మండలంలోని నారాయణవనం, కీళగరం, పాలమంగళం దక్షణపుకండ్రిగలో గురువారంనందమూరితారక రామారావు వర్ధంతినిఘనంగాజరుపుకున్నారు. విగ్రహానికి పూలమాలు వేసి అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణవనంలో మండల టిడిపి కన్వీనర్ పి గిరిబాబు, బోస్ సేవా సంస్థ వద్ద మాజీ మండల అధ్యక్షులు ఎన్ భాస్కరన్ ఎన్టీఆర్ వర్ధంతిని జరుపుకున్నారు. పాలమంగళంలో మాజీ వైస్ఎంపిపిటి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వ హించారు.నారాయణవనంలోఎన్టీఆర్విగ్రహానికి పాలా భిషేకం చేసి పూల మాలలను వేశారు. నారాయణవనంలో బాలకృష్ణ అభిమానులు కూల్డ్రింక్స్ కె రమేష్ బాబు, కెవాసుదేవన్, సుబ్రమణ్యం, మోహన్బాబు ఆధ్వర్యంలో పేదలందరికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో పుత్తూరు మండల మాజీ ఎంపిపి గంజి మాదవయ్య, మాజీ సర్పంచ్ కెఎస్.రవి, కె.వాసుదేవన్, వేలురెడ్డి, ఎ.హరి, మురుగేశరెడ్డి, శరవణ, జిఎం రవి, సుబ్రమణ్యం, సి బాబు, కిలారి విజయకుమార్, ఎన్ కందస్వామినాయుడు, సి వాపుదేవయ్య,సిదానివేలు,మునివేలు,కుమార్,కెఎస్.శేఖర్,జయచంద్రానాయుడు,లోకయ్య, కుట్టప్ప,ఆలీ, పి.భాస్కర్బాబు,మునిబాబు, కిరణ్, ఏకాంబరం, పురుషోత్తం, ధశరధన్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్క్రాంతి పథకం సిబ్బంది ప్రభుత్వంపై నిరసన

**నారాయణవనం, జనవరి 18 ప్రభాతవార్త :**



మండలంలోని వైఎస్ఆర్క్రాంతి పథకంలో పనిచేస్తున్న సిబ్బంది తమ డి మాండ్ల సాధనం కోసంనిరసన కార్యక్రమంను నిక్వహిస్తున్నారు. వీరి నిరసనకు మండల సమాఖ్య గురువారం మద్దతు ఇచ్చి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమద్దీకరణ కొరకు నియమించిన సబ్ కమిటీ ద్వారా సెర్ప్ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి పని చేస్తున్న ఉద్యోగులకు కార్డ్ ఫిక్స్ చేస్తూ పే స్కేల్ ఫిక్స్ చేసి సర్వీస్ రెగ్యులర్ చేయాలన్నారు.ఎపిఎం మమత, సిసిలు నాగేంద్రరావు, సురేష్, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు భీమునిచెరువులో ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం

**నారాయణవనం, జనవరి 18 ప్రభాతవార్త :**
భీమునిచెరువు సచివాలయంలో శుక్రవారం ఉదయం 9నుంచి4 గంటల వరకు ఆరోగ్య సురక్ష-2కార్యక్రమంజరుగుతుందనిడాక్టర్ దర్శిత్రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి నుంచి ఇద్దరు ప్రత్యేక డాక్టర్లు హాజరవుతారని, కావున 0-5 వరకు కంటి వైద్య పరీక్షలు, అలాగే బిపి, షుగర్ పరీక్షలు జరిపించడం జరుగుతుందన్నారు. కావున ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

## ఎన్టీఆర్తోనే తెలుగుజాతికి గౌరవం

**వడమాలపేట, జనవరి 18 ప్రభాతవార్త:**



నందమూరి తారకరామారావు తోనే తెలుగువారికి గౌరవం వచ్చిందని చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధిధనంజయ నాయుడు తెలిపారు. గురువారం వడ మాలపేటలోఎన్టీఆర్వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్ర మంలోనాయకులు లక్ష్మిప్రసన్న,దాముయాదవ్, వెంకటయ్య, హేమా వతి, దేవ, రఘు, ఆదినా రాయణ, సురేష్, ధనలక్ష్మి, శివ రాయల్, పురుషోత్తం, రాధాకృష్ణ, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించండి

**నింద్ర,జనవరి 18 ప్రభాతవార్త :**
ప్రకృతి వ్యవసాయంపై రైతులను ప్రోత్సహించాలని మండల వ్యవసాయాది .కారి తులసితెలిపారు. గురువారంఅత్తూరుయూనిట్లోమహిళా మండల సమైఖ్య ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులఅమ్మకంచేసారు. ఈకార్యక్రమంలోఎపియంచంద్రకళ,సిసిగిరి,మంజుల,సంపత్, రూప, కోమల, రేవతి, వల్లెమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ చారిత్రాత్మక ఘట్టం

**నింద్ర,జనవరి 18 ప్రభాతవార్త :**



విజయవాడలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చారిత్రాత్మక ఘట్టం అని నింద్ర ఎంపిపి దీపాజలంధర్రాజు తెలిపారు. గురువారం నింద్ర నుంచి అంబేద్కర్ విగ్రహాష్కరణకు వైకాపాకార్యకర్తలుపెద్దఎత్తున విజయవాడకు బయలుదేరి వెళ్ళారు. ఈకార్యక్రమంలోకోఆప్షన్మెంబరుఅనిల్,నాయకులు శేఖర్, దాము,సంపత్,చార్లీ,గిరి,రామచంద్రయ్య,సత్యరాజ్,లక్ష్మిపతి,దినకర్,సుధాకర్,శేఖర్తదితరులుపాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

**బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 18 ప్రభాతవార్త:**
నందమూరి తారకరామారావు వర్ధంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు మావిళ్ళపల్లె సుధాకర్ నాయుడు,మాజీ జడ్పీటీసీసముద్రాలసుధాకర్నాయుడు ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు.

## వైభవంగా గౌరమ్మ పండుగ వేడుకలు

**బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 18 ప్రభాతవార్త:**



హిందువుల సంక్రాంతి పండుగలు గౌరమ్మ పండుగఒక ప్రత్యేకమైనది. మహి ళలకుఎంతో ఇష్టమైన ప్రత్యేకమైన గౌరమ్మ పండుగను బుచ్చినాయుడు కండ్రిగ మహిళలు వైభవంగా సాంప్రదాయ పద్ధతిగా పండుగను మంగళ వాయిద్యాలు అలంకార మధ్య ఘనంగా నిర్వహించారు. గౌరమ్మను మధ్యలో పెట్టుకుని చుట్టూ మహిళలు చేరుకుని గొబ్బెమ్మలు తడుతూ ఎంతో వినోదకరమైన పల్లె పాటలను పాడుతూ చక్కటి అందమైన ప్రదర్శనలు మహిళలు నిర్వహించారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు సదుం నాయకులు

**సదుం,జనవరి18ప్రభాతవార్త**



విజయవాడలో జరిగే అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ ప్రతిష్టకు సదుం మండల దళిత బహుజన నాయకులు గురువారం బయలు దేరి వెళ్లారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయలం వద్ద బస్సుకు ఎంపీపీ ఎల్లప్ప జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైకాపా ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకట స్వామి,డప్పు కళాకారుల సంఘం పుంగనూరు నియోజక వర్గ అధ్యక్షుడు మందా సీతాపతి, తాటిగుంటపాలెం ఉపసర్పంచి రామచంద్రయ్య, ఎంపీడీఓ వరప్రసాద్,సాంఘిక సంక్షేమబాలుర వసతి గృహ సంక్షేమాధికారి షరీఫ్భాషా, అమ్మగారిపల్లె వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, దళిత బహుజన సంఘాల నాయకులు మల్లేపల్లెశ్రీనివాసులు,రొడ్డారమేష్,మాధవ ,శ్రీరాములు,లక్ష్మయ్య, మునిరామ య్య, రమణ, నారాయణ, లక్ష్మయ్య,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టిఆర్ వర్ధంతి

**వెదురుకుప్పం, జనవరి 18 ప్రభాతవార్త :**
నందమూరితారకరామరావు వర్ధంతి మండలంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం,పచ్చికాపల్లం కూడలిలో ఆయన చిత్రం పటంకు పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులులోకనాథరెడ్డి ,నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గురసాల కిషన్ చందన్, యూనిట్ ఇన్చార్జీ మోహన్ యాదవ్, టిఎన్టియుసిఅధ్యక్షులు గాలి బాబు నాయుడు, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి వెంకటమరణా రెడ్డి, మండల యాదవ సాధికారిక అధ్యక్షులు గురవయ్య, బూత్ కన్వీనర్ రాజశేఖర్ వర్మ, మాజీ సర్పంచులు బట్టే చాణిక్య ప్రతాప్, విశ్వనాధం,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సమతా సంకల్ప బస్సుయాత్ర ప్రారంభం

**వెదురుకుప్పం, జనవరి 18 ప్రభాతవార్త :**
సామాజిక సమతా సంకల్ప బస్సు యాత్రను గురువారం జడ్పీటిసి చల్లం పాళ్యం సుకుమార్, ఎంపిడిఓ ప్రేమ్రాజ్ కుమార్ ఎంపిడిఓ కార్యాలయం ఆవరణంలో జెండా ఊపి ప్రారంభించారు.ప్రభుత్వం విజయవాడలో నిర్మించిన 125 అడుగుల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పురస్కరించుకుని బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొజ్జా రెడ్డి, పొన్నయ్య, భూపాలయ్య, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదం ఎన్టీఆర్

**చంద్రగిరి, జనవరి 18 ప్రభాతవార్త:**
నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదమని పార్టీ మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు కొనియాడారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద గురువారం మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి,నాయుడమ్మ, సునీత,రాధ, కొండూరు ప్రవీణ్ రాయల్, గౌస్భాషా, ఏజి పల్లి బాల,గిరిధర్ రెడ్డి, లంకెళ్ళ లలిత, పులికంటి మోహన్ రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, కాపువీధి సునీల్, ఉమాపతి రెడ్డి, రాజులగారి వినోద్కుమార్ రెడ్డి, శానంబట్ల తులసి రెడ్డి, కన్నయ్య నాయుడు, దొమ్మలపాటి సతీష్, అనార్కలి, గ్యాస్ నాగరాజ, హోండా హరి, తదితరులు పాల్గొన్నారు.

